నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 2 ఆగస్టు 2024 RANGAREDDY




చేవెళ్లలో..



చేవెళ్ల పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అవమానంపై ఆగ్రహ జ్వాల..



షాబాద్ : రాస్తారోకోలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు

- మాజీ మంత్రి సబితారెడ్డిపై సీఎం, డిప్యూటీ సీఎంల వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క దిష్టిబొమ్మల దహనం
- ఊరూరా రాస్తారోకోలు.. ధర్నాలు చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు
- సబితారెడ్డికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్

రంగారెడ్డి, ఆగస్టు 1(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లా ప్రజానీకం భగ్గుమన్నది. ఈ మేరకు గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఊరూరా రాస్తారోకోలు, ధర్నాలు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, మాడ్గుల తదితర మండలాలు, మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళనను చేపట్టాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తొలి మహిళా హోం మంత్రిగా, తెలంగాణ తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన సబితాఇంద్రారెడ్డిపై నిండు శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి చేసిన వ్యాఖ్యలు యావత్ తెలంగాణ ఆడబిడ్డలను అవమానించేలా ఉన్నాయని, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలన తీరును ప్రజలు గమనిస్తున్నారని.. రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఇప్పటికైనా మహిళలను గౌరవించే సంస్కృతిని నేర్చుకోవాలని హితవు పలికారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### వికారాబాద్ జిల్లావ్యాప్తంగా...

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు వికారాబాద్ జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రం మొదలుకొని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే సబితారెడ్డిని అవమానించేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మహిళా మంత్రులను కించపరిచేలా మాట్లాడిన మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందన్న సోయి లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావంటూ, ముంచుతారంటూ సీఎం తన స్థాయిని మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ఖండించారు. తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాగా ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల సీఎం దిష్టిబొమ్మలను దహనం చేయనివ్వకుండా బీఆర్‌ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు.



పూడూరులో సీఎం దిష్టిబొమ్మ దహనం..



పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

### నమ్మించి మోసం చేస్తున్నది..



ప్రభుత్వం షరతులు పెట్టి అన్నదాతలకు అన్యాయం చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుల రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేసి తీరుతామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు అధికా రంలోకి రాగానే మాటమార్చడం తగదు. రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుని రుణమాఫీ చేయడం ద్వారా వేలాది మంది రైతులకు మాఫీ వర్తించడం లేదు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బ్యాంకు రుణాలను చెల్లించేందుకు అన్నదాతలు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాలని దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వం అన్నదాతలను నమ్మించి మోసం చేస్తున్నది..

-కుర్వ భిక్షపతి , రైతు, నాగులపల్లి గ్రామం, పెద్దేముల్

# అర్హులమైనా.. మాఫీ కాలె

- రుణమాఫీపై అధికారులకు వెల్లువెత్తుతున్న వినతులు
- వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 1700 ఫిర్యాదులు
- రెండు రోజుల్లో కంట్రోల్ రూమ్‌కు వెయ్యికిపైగా ఫోన్‌కాల్స్
- కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందంటూ అన్నదాతల ఆగ్రహం
- లక్షన్నర రుణమాఫీతో జిల్లాలో కేవలం 73 వేల మందికే లబ్ధి

వికారాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): రూ. లక్షన్నర లోపు రుణమాఫీ కాలేదంటూ వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం మొదలుకొని క్షేత్రస్థాయిలో ఏఈవోల వరకు రైతులు వేలాదిగా తరలివచ్చి రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు, షరతులు పెట్టి కొంతమందికే రుణమాఫీ చేయడంతో... అర్హులమైనా మా రుణాలు ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీ కాని రైతుల సంఖ్య వేలాదిగా ఉండడంతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. అదేవిధంగా జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలోని టెక్నికల్ సెక్షన్, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలు, క్షేత్రస్థాయిలో క్లస్టర్ల వారీగా ఏఈవోలు బాధిత రైతుల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు వికారాబాద్ జిల్లాలో 1,700 మంది రైతులు తమకు రూ.లక్షన్నర లోపు రుణాలున్నా మాఫీ కాలేదని విన్నవించినట్లు అధికారులు చెబుతుండగా.. అనధికారికంగా ఈ సంఖ్య ఐదువేల పైగానే ఉంటుందని సమాచారం. గత రెండు రోజుల్లో 500 మంది రైతులు రూ.లక్షన్నర లోపు రుణాలు న్నా మాఫీ కాలేదంటూ వ్యవసాయ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేయగా.. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు వెయ్యికి పైగా ఫోన్‌కాల్స్ ద్వారా విజ్ఞప్తులొచ్చాయి.

కాగా వ్యవసాయాధికారులు రేషన్ కార్డు లేకపోవడంతో పలువురు రైతుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోవడంలేదని సమాచారం. కేవలం అండర్ ప్రాసెస్ ఉన్న విజ్ఞప్తులను మాత్రమే స్వీకరించి, త్వరలోనే పూర్తవుతుందని చెబుతున్నారు. అయితే రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని వేలాది మంది అన్నదాతలకు రుణమాఫీ వర్తించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిం దని రుసరుసలాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.రెండు లక్షల వరకు రైతుల పంట రుణాలను ఏక కాలంలో మాఫీ చేస్తామని గొప్పగా ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చి గద్దె ఎక్కగానే మాట మార్చారని.. కొర్రీలు, షరతులు పెడుతూ వేలాది మందికి మాఫీ వర్తించకుండా చేస్తున్నారని మండిపడుతున్నారు. రుణమాఫీతో బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాల భారం తప్పుతుందని.. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతామని భావించిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బ్యాంకుల్లోని అప్పులను చెల్లించేందుకు మళ్లీ ప్రైవేట్, వడ్డీ వ్యా పారులను ఆశ్రయించాలని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని రూ.లక్షన్నర రుణమాఫీ ప్రక్రియ చేపట్టడంతో కేవలం 73,000 మంది రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. అదే పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకున్నట్లైతే లక్షన్నరకుపైగా రైతులకు ప్రయోజనం చేకూరేది. అదేవిధంగా బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాలో రూ. లక్ష రుణమాఫీతో లక్షా20 వేల మంది రైతులకు లబ్ధి చేకూరడం గమనార్హం.

### కొర్రీలతో అన్నదాతల పరిస్థితి ఆగమాగం..



అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకేసారి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడు విడతల వారీగా చేయడం విడ్డూరంగా ఉన్నది. ఎన్నికల సమయంలో ఓ రకంగా.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజనం. బ్యాంకులో నా పేరుతో రూ.1,26,000 క్రాప్ లోన్ ఉన్నది. అర్హుడిని అయినా ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. రుణమాఫీ చేస్తున్నమని గొప్పగా చెప్పుకొంటున్న ప్రభుత్వం అర్హులకు అన్యాయం చేస్తున్నది. కొర్రీలు పెట్టి అన్నదాతలను ఇబ్బంది పెట్టడం సరికాదు..

-రవి, రైతు, బండపల్లి గ్రామం, పెద్దేముల్

### అర్హులకు అన్యాయం..



నాకు రెండెకరాల 12 గంటల భూమి ఉన్నది. నా పేరుతో బ్యాంకులో రూ.లక్ష లోపు క్రాప్ లోన్ ఉన్నా మాఫీ కాలేదు. నేను అర్హురాలినే అయినా నా పేరు ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో లేదు. కారణం అడిగితే బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో అమలు కాని హామీలిచ్చింది. పవర్‌లోకి రాగానే వాటన్నింటినీ గాలికి వదిలేసింది. రుణమాఫీ అంటూ గొప్పలు చెప్పుకోవడమే తప్ప నిజమైన రైతులకు న్యాయం జరుగడంలేదు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేస్తాం.

-గొల్ల రామమ్మ, గ్రామం కోకట్, యాలాల మండలం



# స్వచ్ఛదనం-పచ్చదనాన్ని సక్సెస్ చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఆగస్టు 1 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో చేపట్టాల్సిన వివిధ అంశాలపై గురువారం ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర సీఎస్ శాంతికుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలో ఐదురోజులపాటు జరుగనున్న ఈ ప్రోగ్రాంలో రోజువారీగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలన్నారు. స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించి అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్లలో పారిశుధ్య పనులతో పాటు, ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటిస్తూ మురుగు కాలువలను శుభ్రం చేయించాలన్నారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై విద్యార్థులకు వ్యాసరచన, పద్య గేయాల పోటీలు నిర్వహించి బహుమతులను ఇచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ డీఈవోకు సూచించారు. వన మహోత్సవం కింద గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ నిమిత్తం అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటేందుకు ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కుక్కల బెడద ఉన్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి,డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్ , పశు సంవర్ధక శాఖ అధికారి పూర్ణచంద్రరావు, ఆర్ అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు

# బోనం.. ఘనం..



రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, చేవెళ్ల, నందిగామ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.



నందిగామ మండలంలోని జంగోనిగూడెంలో బోనాల ఊరేగింపు..



మొయినాబాద్‌లోని అండాపూరులో...